సాక్షి తిరుపతి

ఆదివారం । 16 । జూన్ । 2024



శ్రీకాళహస్తిలో విధ్వంసం

శ్రీకాళహస్తి సమీపంలోని రాజీవ్ నగర్‌లో పలు కట్టడాలను రెవెన్యూ, మున్సిపల్ అధికారులు తొలగించారు. - 8లో



ముక్కంటి సేవలో ప్రముఖులు

శ్రీకాళహస్తీశ్వరస్వామివారిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. అధికారులు ఏర్పాట్లు చేశారు. - 8లో



'ఫెర్టీ 9' ఫెర్టిలిటీ సెంటర్లు

తిరుపతి, రాజమహేంద్రవరంలో ఫెర్టీ 9 ఫెర్టిలిటీ సెంటర్లను శనివారం నూతనంగా ప్రారంభించారు. - 8లో

దేశవిదేశాల నుంచి నిత్యం తరలివస్తున్న భక్తులు.. అదే స్థాయిలో నడుస్తున్న ఆర్టీసీ సర్వీసులు.. ఆదాయంలో రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలుపుతున్న వనరులు.. అకుంఠిత దీక్షతో పనిచేసే ఉద్యోగులు.. ఇదీ తిరుపతి సెంట్రల్ బస్టాండ్ పరిస్థితి. కానీ ఏం లాభం.. ఇక్కడి అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రయాణికులు ముప్పుతిప్పలు పడాల్సి వస్తోంది. సుమారు 64 ప్లాట్‌ఫామ్‌లున్న ఈ బస్టాండ్‌లో కొత్తవారు.. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు ఏ బస్సు ఏ ప్లాట్‌ఫామ్‌పై ఉందో తెలుసుకోలేక తికమక పడుతున్నారు. అనౌన్స్‌మెంట్ మైకులు మూగనోము పట్టడంతో బస్సుల కోసం ప్రయాణికులు వెతుకులాడాల్సిన దుస్థితి దాపురించడం సర్వత్రా విమర్శలకు తావిస్తోంది.

మా ఊరి బస్సు ఎక్కడ





ప్లాట్‌ఫామ్ లేని సర్వీసుల్లో ఎక్కుతున్న ప్రయాణికులు



తిరుపతి బస్టాండ్‌కు పెరుగుతున్న భక్తుల తాకిడి

- నామమాత్రంగానే వసతులు
- మూగబోతున్న అనౌన్స్‌మెంట్ మైక్‌లు
- బస్సుల కోసం ప్రయాణికుల తికమకలు
- పట్టించుకోని ఆర్టీసీ అధికారులు

తిరుపతి అర్బన్: ఆధ్యాత్మిక కేంద్రమైన తిరుపతి నగరానికి దేశవిదేశాల నుంచి భక్తులు వచ్చిపోతుంటారు. వీరి సౌకర్యార్థం గతంలో తిరుపతి సెంట్రల్ బస్టాండ్‌ను 11.5 ఎకరాల విస్తీర్ణంలో 64 ప్లాట్‌ఫాంలతో నిర్మించారు. 5 దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసిన ఈ బస్టాండ్ ఆదాయంలో రాష్ట్రంలోనే నం.1 స్థానంలో ఉన్నా.. ఆ స్థాయిలో వసతులు లేకపోవడంతో ప్రయాణికులు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధానంగా అనౌన్స్ మెంట్ మైక్‌లు పనిచేయక పోవడంతో తమ ఊరి బస్సులు ఎక్కడ ఆగుతాయో తెలియక చాలా మంది ఇబ్బంది పడుతున్నారు. కొందరు సెంట్రల్ బస్టాండ్ ప్రాంగణంలోని నాలుగు బస్టాండ్ల చుట్టూ చక్కర్లు కొడుతున్నారు. కొన్ని సర్వీసులకు చాలినన్ని ప్లాట్‌ఫామ్‌లు లేకపోవడంతో ఎక్కడపడితే అక్కడ ఆపేస్తున్నారు. ఆ సర్వీసులను గుర్తించడం ప్రయాణికులకు ప్రాణ సంకటంగా మారుతోంది.

ఏ ప్లాట్‌ఫాం ఎక్కడో?

తిరుపతి సెంట్రల్ బస్టాండ్ ప్రాంగణంలో శ్రీహరి, శ్రీనివాస, ఏడుకొండలు, పల్లెవెలుగు పేరుతో నాలుగు బస్టాండ్లు కొనసాగుతున్నాయి. శ్రీహరి బస్టాండ్‌లో 1 నుంచి 20 వరకు ప్లాట్‌ఫాంలు, శ్రీనివాస బస్టాండ్‌లో 21 నుంచి 44, ఏడుకొండల బస్టాండ్‌లో 45 నుంచి 57, పల్లెవెలుగు బస్టాండ్‌లో 58 నుంచి 64 ప్లాట్‌ఫాంలు ఉన్నాయి. తిరుపతి బస్టాండ్‌కు రోజుకు 3.5 వేల బస్సులు వచ్చిపోతుంటాయి. జిల్లాలో రోజుకు 5.75 లక్షల కిలోమీటర్ల వరకు సర్వీసులు తిరుగుతుంటాయి. రోజు వారీ ఆదాయం రూ.1.6 కోట్ల నుంచి రూ.1.7 కోట్ల మేర వస్తోంది. ఒక్క తిరుపతి నుంచే రోజూ 1.25 లక్షల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ రద్దీ క్రమంలో తిరుపతి బస్టాండ్‌లోని 64 ప్లాట్‌ఫామ్‌లలో తమ బస్సు నిలబడే ప్లాట్‌ఫామ్ ఎక్కడో తెలియక పలువురు ప్రయాణికులు నానా ఇక్కట్లు పడుతున్నారు.

జిల్లా సమాచారం

డిపోలు 11	సర్వీసులు 814
విద్యుత్ సర్వీసులు 100	ఉద్యోగులు 4255
రోజువారీ ప్రయాణికులు 5.75 లక్షలు	రోజువారీ ఆదాయం రూ.1.60 కోట్ల నుంచి రూ.1.70 కోట్లు
ఆర్టీసీ దుకాణాలు 504	ఏడాదికి దుకాణాల ద్వారా వచ్చే ఆదాయం 52 కోట్లు
కార్గో ఆదాయం రూ.72 లక్షల నుంచి రూ.80 లక్షలు	



పల్లెవెలుగు బస్టాండ్



ఏడుకొండల బస్టాండ్

అనౌన్స్‌మెంట్‌పై ప్రత్యేక దృష్టి



తిరుపతి సెంట్రల్ బస్టాండ్ ప్రాంగణంలో నాలుగు బస్టాండ్లు.. 64 ప్లాట్‌ఫామ్‌లు ఉన్నాయి. కొత్త వారు తమకు కావాల్సిన బస్సు ఏ ప్లాట్‌ఫామ్‌లో ఉందో తెలుసుకోవాలంటే ఇబ్బందిగా ఉంటుంది. అందుకే అనౌన్స్‌మెంట్ పెట్టాం. దానిపై ప్రత్యేక దృష్టి పెడతాం. నిత్యం అనౌన్స్‌మెంట్ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటాం.

– డీఆర్.నాయుడు, ఏటీఎం, తిరుపతి బస్టాండ్

న్యూస్‌రీల్

వేడుకగా ఊంజల్ సేవ



ఊయలపై కొలువుదీరిన దేవదేవేరులు

నారాయణవనం: నారాయణవనంలోని పద్మావతీ సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం సాయంత్రం వేడుకగా ఊంజల్ సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపిన అర్చకులు నిత్యం కైంకర్యాలను సమర్పించారు. అనంతరం దేవదేవేరులను తిరుచ్చిపై కొలువుదీర్చారు. పెద్దసంఖ్యలో భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లకు కనులపండువగా ఊంజల్ సేవ జరిపించారు. ఆలయ అధికారి నాగరాజు, ఆర్జితం అధికారి భరత్, షరాబు షనాయ్‌ల ఏర్పాట్లను పర్యవేక్షించారు.

తిరుచ్చిపై శ్రీవారి చిద్విలాసం



తిరుచ్చిపై ఊరేగుతున్న దేవదేవేరులు

చంద్రగిరి : శ్రీనివాసమంగాపురంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామివారు శనివారం సాయంత్రం బంగారు తిరుచ్చిపై భక్తులకు దర్శనమిచ్చారు. వారపు ఉత్సవాల్లో భాగంగా ఉదయం స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్య కైంకర్యాలు సమర్పించారు. అనంతరం స్వామివారికి అభిషేక సేవను నిర్వహించి శోభాయమానంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను మండపంలోకి వేంచేపు చేశారు. కనులపండువగా కల్యాణోత్సవం జరిపించారు. సాయంత్రం ఆలయ ఆవరణలో వేడుకగా ఊంజల్ సేవ చేపట్టారు. ఈ క్రమంలోనే సర్వాలంకార శోభితుడైన శ్రీనివాసుడు, అమ్మవార్లతో కలసి బంగారు తిరుచ్చి వాహనంపై కొలువుదీరారు. నాలుగు మాడవీధులలో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. కార్యక్రమంలో ఆలయ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మీ, ఏఈఓ గోపీనాథ్, సూపరింటెండెంట్ వెంకటస్వామి, ఆలయ ఇన్‌స్పెక్టర్ కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

18వ తేదీ డిగ్రీ పరీక్ష వాయిదా

తిరుపతి సిటీ : ఎస్వీయూ పరిధిలో ఈ నెల 12 నుంచి నిర్వహిస్తున్న డిగ్రీ 2వ, 4వ సెమిస్టర్ పరీక్షల్లో భాగంగా 18వతేదీ మంగళవారం జరిగే పరీక్షను వాయిదా వేస్తున్నట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ దామ్లా నాయక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. యూజీసీ నెట్ పరీక్ష జరగనున్న కారణంగా వాయిదా వేసినట్లు వెల్లడించారు. జూలై 9వ తేదీన ఈ పరీక్ష నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ క్రమంలోనే శనివారం మాస్ కాపీయింగ్‌కు పాల్పడిన 11మంది విద్యార్థులను డీబార్ చేసినట్లు తెలిపారు.

శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు నిండిపోయాయి. శుక్రవారం 66,782 మంది స్వామివారిని దర్శించుకున్నారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని వారికి 18 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనమవుతోంది.

బక్రీద్‌కు పకడ్బందీ భద్రత



మాట్లాడుతున్న ఎస్పీ హర్షవర్ధన్ రాజు

తిరుపతి క్రైమ్ : బక్రీద్ పర్వదినం సందర్భంగా జిల్లాలోని అన్ని మసీదుల వద్ద పకడ్బందీగా భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు ఎస్పీ హర్షవర్ధన్‌రాజు వెల్లడించారు. శనివారం ఆయన మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో బక్రీద్ జరుపుకోవాలని కోరారు. జిల్లాలో 2017 చట్టం అమలులో ఉందని, గోవధ నిషేధంలో ఉందని, గోవులను తరలించేవారు తప్పనిసరిగా అనుమతి పత్రాలు పొందాలని ఆదేశించారు. జిల్లా సరిహద్దుల వద్ద 9 చెక్‌పోస్టు ఏర్పాటు చేశామని, గోవుల అక్రమ రవాణాపై నిఘా పెట్టామని వివరించారు. ఈ క్రమంలోనే మత సామరస్యానికి భంగం వాటిల్లేలా ఎవరైనా వ్యాఖ్యానిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఎక్కడైనా అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకుంటే 8099999977 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు

సమాచారం చేర్చడంలో అప్రమత్తం

అధికారులు ఎప్పటికప్పుడు సమాచారం చేరవేయడంలో అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశించారు. శనివారం నగరంలోని పోలీస్ అతిథిగృహంలో జిల్లాలోని స్పెషల్ బ్రాంచ్ పోలీసులతో సమావేశం నిర్వహించారు. అందుబాటులోకి వచ్చిన ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుని నైపుణ్యం పెంపొందించుకోవాలన్నారు. ప్రతి ఒక్కరికీ తమ నిర్దేశిత ప్రాంతాల స్వరూపం గురించి క్షుణ్ణంగా అవగాహన ఉండాలని సూచించారు. అసాంఘిక కార్యక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు ప్రత్యేకంగా కృషి చేయాలని కోరారు. రౌడీ షీటర్లు, ట్రబుల్ మాంగర్స్, బైండోవర్ చేసిన వారిపై నిరంతరం నిఘా ఉంచాలన్నారు. ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యక్రమాల్లో పాల్గొనే అవకాశం ఉంటే వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వాలని స్పష్టం చేశారు. జాబ్ వెరిఫికేషన్, పాస్‌పోర్ట్ వెరిఫికేషన్, పిటిషన్ విధులను చిత్తశుద్ధితో నిర్వర్తించాలని తెలిపారు. సమావేశంలో ఏఎస్పీ విమల కుమారి, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ వెంకటాద్రి పాల్గొన్నారు.

రేపటి నుంచి సిరులతల్లి తెప్పోత్సవాలు



పుష్కరిణిలో తెప్ప ట్రయల్ రన్ నిర్వహిస్తున్న టీటీడీ అధికారులు

చంద్రగిరి(తిరుచానూరు) : తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి వార్షిక తెప్పోత్సవాలు సోమవారం నుంచి ఈ నెల 21వ తేదీ వరకు ఐదు రోజుల పాటు ఘనంగా నిర్వహించనున్నారు. ప్రతిరోజు సాయంత్రం 6.30 నుంచి రాత్రి 7.30 గంటల వరకు అమ్మవారు పద్మసరోవరంలో తెప్పపై విహరించనున్నారు. అలమేలు మంగమ్మ పద్మసరోవర తీరంలో పాంచరాత్ర ఆగమపూజలు అందుకుని భక్తులను అనుగ్రహించనున్నారు.ఏటా జ్యేష్ఠశుద్ధ ఏకాదశి నుంచి పౌర్ణమి వరకు అమ్మవారికి రమణీయంగా తెప్పోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. పద్మసరస్సులో బంగారు పద్మం నుంచి ఆవిర్భవించిన పద్మావతీదేవి జీవకోటిని రక్షించి, సర్వసౌఖ్యాలు ప్రసాదిస్తారని తెప్పోత్సవాల అంతరార్థం.

ఉత్సవాల వివరాలు

మొదటి రోజు రుక్మిణి, సత్యభామ సమేత శ్రీకృష్ణస్వామి, రెండో రోజు శ్రీసుందరరాజస్వామి, చివరి మూడు రోజులు శ్రీ పద్మావతి అమ్మవారు తెప్పలపై విహరిస్తారు. చివరి మూడు రోజుల పాటు పద్మసరోవరంలోని నీరాడ మండపంలో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు అమ్మవారికి స్నపన తిరుమంజనం నిర్వహించనున్నారు. అమ్మవారికి 20వ తేదీ రాత్రి గజవాహనం, 21వ తేదీ రాత్రి గరుడ వాహనసేవ జరిపించనున్నారు. తెప్పోత్సవం అనంతరం ప్రతిరోజు ఆలయ మాడ వీధుల్లో అమ్మవారి ఊరేగింపు నిర్వహించనున్నారు.

ఆర్జితసేవలు రద్దు

తెప్పోత్సవాల కారణంగా అమ్మవారి ఆలయంలో ఐదు రోజుల పాటు కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, 21న లక్ష్మీ పూజను రద్దు చేశారు. ఉత్సవాల సందర్భంగా టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్, అన్నమాచార్య ప్రాజెక్టు, దాససాహిత్య ప్రాజెక్టుల ఆధ్వర్యంలో నిత్యం ఆధ్యాత్మిక, భక్తి సంగీత, సాంస్కృతిక కార్యక్రమాలు, భజనలు, కోలాటాలు జరిపించనున్నారు.

ట్రయల్ రన్ విజయవంతం

అమ్మవారి తెప్పోత్సవాల నిర్వహణకు టీటీడీ యంత్రాంగం పకడ్బందీ ఏర్పాట్లు చేసింది. టీటీడీ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో తెప్పను సిద్ధం చేశారు. ఈ మేరకు శనివారం మధ్యాహ్నం పుష్కరిణిలో ట్రయల్ రన్‌ను చేపట్టారు. ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా ముందస్తుగా తెప్పను ప్రయోగాత్మకంగా పరిశీలించినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

ఎర్రాతివారిపల్లెలో ఎమ్మెల్యే, ఎంపీ



నేతలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



నాయకులతో మాట్లాడుతున్న ఎంపీ మిథున్ రెడ్డి

సదుం: మండలంలోని ఎర్రాతివారిపల్లెకు మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి శనివారం విచ్చేశారు. స్వగ్రామా నికి వచ్చిన వారిని పలువురు ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు మర్యాదపూర్వకంగా కలిశారు. పలు అంశాలపై వారితో చర్చించారు. పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దిరెడ్డి, ఇక్బాల్ అహమ్మద్, జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్ రెడ్డి, సదుం, పులిచెర్ల ఎంపీపీలు ఎల్లప్ప, సురేంద్రనాథ రెడ్డి, కృష్ణా రెడ్డి, మండల కన్వీనర్ రెడ్డెప్ప రెడ్డి, జేసీఎస్ ఇన్‌చార్జి ప్రకాష్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, ఫకృద్దీన్ షరీఫ్, శివారెడ్డి, నారాయణ రెడ్డి, మురళీ రెడ్డి, బాబురెడ్డి, నాగభూషణం రెడ్డి, గణేష్ రెడ్డి, వెంకటస్వామి, నాదముని రెడ్డి, ఉషారాణి, శ్రీనివాసులు, శివ, ఇందాద్, మహేష్, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


అధైర్య పడొద్దు.. అండగా ఉంటాం



పార్టీ నేతలు, కార్యకర్తలతో మాట్లాడుతున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వాకాడు : రాజకీయాల్లో గెలుపోటములు సహజమని, కార్యకర్తలు అధైర్యపడొద్దని.. అండగా నిలబడతామని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి భరోసా ఇచ్చారు. శనివారం వాకాడులోని తన నివాసంలో కోట, చిట్టమూరు, వాకాడు మండలాల్లోని వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. రామ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అడుగులో అడుగు వేస్తామని, నిత్యం ప్రజల్లో ఉంటూ కేడర్‌ను కాపాడుకుంటామని వెల్లడించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఎప్పటికప్పుడు పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. అధికారంలోకి వచ్చాక టీడీపీ శ్రేణుల దాడులతో రాష్ట్రంలో అత్యంత భయానక పరిస్థితులు నెలకొన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం మండలాల వారీగా నేతల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై నాయకులు, కార్యకర్తలతో చర్చించారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నేతలు కొడవలూరు దామోదర్‌రెడ్డి, నేదురుమల్లి హిమకుమార్‌రెడ్డి, మల్లాం బాబురెడ్డి, యల్లంటి శివారెడ్డి, నెల్లూరు పెంచలరెడ్డి, మాజీ ఎంపీపీ దువ్వూరు మధురెడ్డి, దేవారెడ్డి నాగూర్‌రెడ్డి, పి.కృష్ణారెడ్డి, పాపారెడ్డి రాజశేఖర్‌రెడ్డి, వాకాటి రవి, శేషురెడ్డి, గూడూరు వెంకటేశ్వర్లురెడ్డి, ఏనుగు సుధాకర్‌నాయుడు, గూడూరు సుధాకర్‌రెడ్డి, మెట్టు శ్రీహరిరెడ్డి పాల్గొన్నారు.

29న జాతీయ లోక్ అదాలత్



న్యాయమూర్తి శ్రీనివాస్‌నాయక్

శ్రీకాళహస్తి : కేసుల సత్వర పరిష్కారం కోసం ఈ నెల 29వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు శ్రీకాళహస్తి అదనపు జిల్లా న్యాయమూర్తి శ్రీనివాస్ నాయక్ తెలిపారు. శనివారం ఆయన కోర్టు ఆవరణంలో మాట్లాడుతూ అన్ని శాఖల సహకారంతో లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. లోక్ అదాలత్‌లో ఇరువర్గాల వారు విజేతలేనని తెలిపారు. ప్రతి ఒక్కరూ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు బేబీరాణి, ధర్మారావు, కృష్ణప్రియ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ముక్కంటి సేవలో ప్రముఖులు



ధ్వజస్తంభం వద్ద జీఎంఆర్ గ్రూప్స్ అధినేత బొమ్మిడాల శ్రీనివాస్, కుటుంబ సభ్యులు

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని శనివారం పలువురు ప్రముఖులు సేవించుకున్నారు. మహారాష్ట్ర గవర్నర్ రమేష్ బైస్, జీఎంఆర్ గ్రూప్స్ అధినేత బొమ్మిడాల శ్రీనివాస్, యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ కుటుంబ సమేతంగా వేర్వేరు సమయాల్లో దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. మృత్యుంజయ స్వామి సన్నిధి వద్ద వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ క్రమంలోనే నిత్యాన్నదాన పథకానికి జీఎంఆర్ గ్రూప్స్ అధినేత బొమ్మిడాల శ్రీనివాస్ రూ.66,664 విరాళం అందించారు.

పెన్షన్ సమస్యల పరిష్కారానికి డిమాండ్



మాట్లాడుతున్న మార్కొండరెడ్డి

తిరుపతి కల్చరల్ : విశ్రాంత ఉద్యోగుల పెన్షన్ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.మార్కొండరెడ్డి, ఆర్‌డీ శ్రీనివాసులు డిమాండ్ చేశారు. శనివారం నగరంలోని పెన్షనర్స్ కార్యాలయంలో అసోసియేషన్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అభినందనలు తెలిపారు. తిరుపతి నుంచి గెలుపొందిన ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులకు శుభాకాంక్షలు చెప్పారు. కూటమి ప్రభుత్వం ప్రతి నెలా ఒకటో తేదీన పెన్షన్ ఇవ్వాలని, పెండింగ్ పీఆర్‌సీ, డీఏ బకాయిలు చెల్లించాలని కోరారు. సమావేశంలో అసోసియేషన్ ప్రతినిధులు కె.శ్రీనివాసులు రెడ్డి, జె.రామలింగారెడ్డి, ఎ.రామకృష్ణయ్య, ఎల్‌వీ రమణారెడ్డి పాల్గొన్నారు.

కారు ఢీకొని వృద్ధుడి మృతి



ప్రమాదానికి కారణమైన కారు

నాగలాపురం: మండలంలోని సుబ్బనాయుడు కండ్రిగ వద్ద శనివారం కారు ఢీకొని ఓ వృద్ధుడు మృతి చెందాడు. వివరాలు.. గ్రామానికి చెందిన సుధాకర్(70) చిన్నాపట్టుకు వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా ప్రమాదం జరిగింది. క్షతగాత్రుడిని వెంటనే నాగలాపురం ప్రభుత్వాస్పత్రికి తరలించగా, అప్పటికే వృద్ధుడు మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సత్యవేడు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

శ్రీకాళహస్తిలో విధ్వంసం





రాజీవ్ నగర్‌లో గోడలు, పునాదులు తొలగిస్తున్న దృశ్యం (ఇన్‌సెట్) కూల్చేసిన పండ్ల దుకాణం



శ్రీకాళహస్తి: పట్టణంలోని రాజీవ్‌నగర్ కాలనీలో రోడ్డు పక్కన కట్టడాలను తొట్టంబేడు తహసీల్దారు శివరాముడు ఆధ్వర్యంలో శనివారం తొలగించారు. అయితే కేవలం కక్షపూరితంగా ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా కూల్చివేశారని బాధితులు ఆరోపించారు. పోలీసు, సీఆర్‌పీఎఫ్ బలగాలతో రెవెన్యూ, మున్సిపల్ అధికారులు రాజీవ్‌నగర్‌కు చేరుకుని మయూర్‌నగర్ ఎదుట ఉన్న రెండు గదులు, రామచంద్రాపురంలోని కట్టడాలను కూలగొట్టారు. అనంతరం రహదారి పక్కనే నిరుపేదలు వేసుకున్న ఇళ్ల పునాదులను జేసీబీ సాయంతో తొలగించారు. ఈ క్రమంలోనే ఓ ఇల్లు కూల్చేందుకు వెళ్లిన అధికారులకు సదరు ఇంటి యజమాని తనకు కమర్షియల్ కరెంట్, ఎంజాయ్‌మెంట్ సర్టిఫికెట్ ఉందని తెలియజేసినా వినిపించుకోలేదు. ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి ఆదేశాల మేరకు అధికారులు కూల్చివేతలకు దిగారని, ఇది కక్ష సాధింపు చర్య అని వైఎస్సార్‌సీపీ నేతలు మండిపడ్డారు. కరెంట్ కనెక్షన్ తీసుకుని మీటర్లు కూడా పెట్టుకుని పక్కా భవనాలు నిర్మించుకున్న తర్వాత ఇలా కూలదోయడం భావ్యం కాదని విమర్శించారు. ఇన్నేళ్లుగా పట్టించుకోని అధికారులు ఇప్పుడు టీడీపీ అధికారంలోకి రాగానే ఇష్టారాజ్యంగా వ్యవహరించడం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధితులు లత, అల్తాఫ్, కుమార్‌కు ముందస్తు నోటీసులు ఇవ్వకుండా ఎలా తొలగిస్తారని అధికారులను ప్రశ్నించారు. ఆదే విధంగా పట్టణంలోని పెద్దమసీదు వద్ద గల 20 ఏళ్లుగా పండ్ల దుకాణం నడుపుకుంటున్న వారికి సైతం కేవలం వైఎస్సార్ సీపీకి ఓటేశారనే కారణంతో వారి షాపును కూల్చేశారని ఆరోపించారు. దీనిపై స్థానిక ముస్లింలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని వివరించారు.

> **అక్రమ కట్టడాలు తొలగించాం**
> “ రాజీవ్‌నగర్ కాలనీ ప్రధాన రహదారిని ఆనుకుని రోడ్డు పోరంబోకును ఆక్రమించుకుని కట్టడాలు నిర్మించుకున్నారు. వాటిని పరిశీలించాం. శనివారం పునాదులను తొలగించాం. పక్కా కట్టడాలకు ఒకరోజు సమయం ఇచ్చాం. విద్యుత్ బిల్లులు వంటి వాటిని పరిశీలించి వాటిని తొలగిస్తాం.
> – శివరాముడు, తహసీల్దార్, తొట్టంబేడు



కట్టడాలను కూల్చివేయిస్తున్న రెవెన్యూ అధికారులు





పండ్ల దుకాణం కూల్చివేతతో ముస్లింల నిరసన



విద్యుత్ మీటర్లు తొలగించి తీసుకెళుతున్న సిబ్బంది

తిరుపతి, రాజమహేంద్రవరంలో ‘ఫెర్టీ 9’ ఫెర్టిలిటీ సెంటర్లు



తిరుపతిలో ఫెర్టీ9 ఫెర్టిలిటీ సెంటర్‌ను ప్రారంభిస్తున్న నిర్వాహకులు

తిరుపతి కల్చరల్: దక్షిణ భారతదేశంలోని ప్రముఖ ఐవీఎఫ్‌చైన్‌గా ఉన్న ఫెర్టీ 9 సంస్థ తిరుపతి, రాజమహేంద్రవరంలో శనివారం రెండు ఫెర్టీ 9 ఫెర్టిలిటీ క్లినిక్‌లు ప్రారంభించింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో దశాబ్దానికి పైగా కార్యకలాపాలతో ఏడు సంతానోత్పత్తి కేంద్రాల ద్వారా సంతానం లేని జంటలకు విశ్వసనీయ భాగస్వామిగా ఫెర్టీ 9 సేవలను అందిస్తోంది. ఈ రెండు కొత్త యూనిట్ల ప్రారంభంతో దక్షిణ భారతదేశంలో మరింత మందికి నైపుణ్యంతో కూడిన ఆధునాతన పునరుత్పత్తి సాంకేతికతలు అందుబాటులోకి రానున్నాయి. తిరుపతి, రాజమండ్రిలో మా కొత్త కేంద్రాలను ప్రారంభించడం ద్వారా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మార్కెట్లలో మేము అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఐవీఎఫ్ చైన్‌గా ఉన్నందుకు చాలా గర్వపడుతున్నామని ఫెర్టీ 9 ఫెర్టిలిటీ సెంటర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, సీఈఓ వినేష్ గాధియా తెలిపారు. ఫెర్టీ 9 వారసత్వం, నిబద్ధత గురించి మాట్లాడుతూ ఈ విస్తరణ మరిన్ని కుటుంబాలకు అత్యాధునిక సంతానోత్పత్తి చికిత్సలు, కారుణ్య సంరక్షణను అందించడం మా మిషన్‌లో ఒక ముఖ్యమైన మైలురాయిని సూచిస్తుందని వెల్లడించారు. ఇప్పటి వరకు 12వేల విజయవంతమైన గర్భాలతో, మా బృందం మా శ్రేష్ఠత వారసత్వాన్ని కొనసాగించడానికి, మరింత మంది జంటలు వారి తల్లిదండ్రుల కలలను సాధించడంలో సహాయపడడానికి అంకితం చేయబడిందన్నారు. ఫెర్టీ9 ఫెర్టిలిటీ సెంటర్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ జ్యోతి మాట్లాడుతూ తిరుపతి, రాజమహేంద్రవరంలో ప్రతి జంటకు సమర్థవంతమైన చికిత్స, ప్రణాళికలను అందించడానికి మా బృందం సిద్ధంగా ఉందని తెలిపారు. ఈ కొత్త కేంద్రాలు భద్రత, పారదర్శకత, కారుణ్య సంరక్షణకు ప్రాధాన్యనిస్తూ సహాయ సంతానోత్పత్తి చికిత్సలతో అత్యుత్తమ ఫలితాలను సాధించడం నిబద్ధతకు పొడిగింపు అన్నారు. తిరుపతిలోని ఫెర్టీ 9 ఫెర్టిలిటీ సెంటర్‌లోని ఫెర్టిలిటీ కన్సల్టెంట్ డాక్టర్ సునీత సాదు మాట్లాడుతూ మా పేషంట్లు తల్లిదండ్రులు కావాలనే వారి కలను నెరవేర్చుకోవడానికి ఈ పరివర్తన ప్రయాణంలో భాగమైనందుకు థ్రిల్‌గా ఉందని వెల్లడించారు. తిరుపతికి చెందిన ఫెర్టీ 9 ఫెర్టిలిటీ సెంటర్ ట్రీట్‌మెంట్ల భవిష్యత్తును సూచిస్తుందని వివరించారు. తిరుపతి ఫెర్టీ9 ఫెర్టిలిటీ సెంటర్ కన్సల్టెంట్ డాక్టర్ దీప్తి దామోదర మాట్లాడుతూ తమ సెంటర్‌లో సాంకేతికత, రోగి అనుభవం రెండింటిలోనూ శ్రేష్టతకు ప్రాధాన్యత ఇస్తున్నామని, ప్రతి రోగి ప్రయాణం, వారికి తగిన మద్దతు, సంరక్షణతో అందేలా చూడడమే మా లక్ష్యమని తెలిపారు.

ముగిసిన రాష్ట్ర స్థాయి సదస్సు



సదస్సుకు హాజరైన వైద్యులు, విద్యార్థులు

తిరుపతి(తుడా): శ్రీ వేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్) ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగం ఆధ్వర్యంలో శ్రీ పద్మావతి వైద్య కళాశాల లెక్చరర్ గ్యాలరీ–1లో నిర్వహించిన రెండు రోజుల రాష్ట్రస్థాయి సదస్సు శనివారంతో ముగిసిందని స్విమ్స్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాల నుంచి సీనియర్ ఫ్యాకల్టీ సభ్యులు, 200 మంది డెలిగేట్స్ సదస్సుకు హాజరైనట్లు వెల్లడించారు. ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ కృష్ణ సింహారెడ్డి మాట్లాడుతూ అల్ట్రా సౌండ్, అంటు వ్యాధి అవుట్ బ్రేక్‌ల నిర్వహణలో అనుభవం వంటి పలు అంశాలపై జనరల్ మెడిసిన్, ఎంబీబీఎస్ విద్యార్థులకు తర్ఫీదు ఇచ్చినట్లు తెలిపారు. అనంతరం 200 మందికి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.

20వ శతాబ్దపు విప్లవ కవి శ్రీశ్రీ



శ్రీశ్రీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కళావేదిక ప్రతినిధులు

తిరుపతి ఎడ్యుకేషన్ : తెలుగు సాహిత్యాన్ని శాసించిన 20వ శతాబ్దపు విప్లవ కవి శ్రీశ్రీ అని శ్రీశ్రీ కళావేదిక జాతీయ కన్వీనర్ కొల్లి అమరావతి కొనియాడారు. శనివారం శ్రీశ్రీ 41వ వర్ధంతిని తిరుపతిలోని విశ్వం విద్యాసంస్థలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీశ్రీ చిత్రపటానికి నివాళులర్పించి ఆమె మాట్లాడారు. అభ్యుదయ భావాలతో జనం గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన వైతాళికుడు శ్రీశ్రీ అని, మరోవైపు సినీ రంగంపై తనదైన ముద్రవేసిన హేతువాది, నాస్తికుడని వెల్లడించారు. కార్యక్రమంలో శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్, రాష్ట్ర అధ్యక్షుడు గుత్తా హరి సర్వోత్తమ నాయుడు, ప్రధాన కార్యదర్శి అరవ జయపాల్, విశ్వం విద్యాసంస్థ డైరెక్టర్ ఎన్.విశ్వచందన్‌రెడ్డి పాల్గొన్నారు.

అనుకూల పంటలతో అధిక దిగుబడి



రైతుకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు, అధికారులు

చంద్రగిరి : వాతావరణానికి తగ్గట్టు అనుకూల పంటలు సాగు చేస్తే అధిక దిగుబడి పొందవచ్చని తిరుపతి చీనీ, నిమ్మ పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. శనివారం మండలంలోని గంగుడుపల్లె, దోర్నకంబాలలో ‘మన గ్రామం– మన విశ్వవిద్యాలయం’ కార్యక్రమం నిర్వహించారు. శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ మామిడికి బదులుగా చీనీ, నిమ్మ, ఉసిరి, జామ వంటి ఉద్యాన పంటలపై రైతులు మొగ్గు చూపాలన్నారు. శాస్త్రవేత్తలు కవిత, ముకుంద లక్ష్మి మాట్లాడుతూ చీనీ తోటల్లో వేరు కుళ్లు నివారణకు కార్బెండజిం 2 గ్రాములను లీటరు నీటికి కలిపి మొదలు దగ్గర వేర్లు తడిచేలా 5 రోజుల వ్యవధిలో మూడు సార్లు మొత్తం 25 లీటర్లు పోయాలని తెలిపారు. చీనీ కాయలు, ఉసిరి కాయ పరిమాణంలో ఉన్నప్పుడు మంగు నల్లి నివారణకు ప్రోపార్గైట్ 2 మిల్లీలీటర్లు లేదా స్పైరోమెసిఫిన్ 0.8 మిల్లీలీటర్లను లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు. మండల ఉద్యాన శాఖ అధికారి శైలజ మాట్లాడుతూ ఉద్యాన పంటల సాగుకు రాయితీలు ఇస్తున్నట్లు వెల్లడించారు.